# భారత్-రష్యా సంబంధాలు... కాల పరీక్షకు నిలిచాయి!!

**1955, జూన్‌లో భారత ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, సోవియట్ రష్యా పర్యటనతో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మొదలయ్యాయి. అ తర్వాత దశాబ్దాలుగా రెండు దేశాల మధ్య సుహృద్భావ సంబంధాలు కొనసాగుతూ వస్తున్నాయి. ప్రచ్ఛన్న యుద్ధానంతరం భారత్, పశ్చిమ దేశాల వైపు మొగ్గు చూపుతూనే.. మరోవైపు రష్యాతోనూ సత్సంబంధాలనుకొనసాగించింది. గతం పునాదిగా.. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా... రెండు దేశాలు తమ ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా దృష్టిసారిస్తున్నాయి. భారత్-రష్యా సంబంధాలు స్నేహపూర్వకమే కాదు.. వ్యూహాత్మకమైనవి కూడా! ఆ వ్యూహాత్మక బంధానికి ఆర్థిక కోణం కూడా జోడించి పటిష్టపరచుకోవడమే ఇరు దేశాలకు ఇప్పుడు అసలుసిసలు సవాలు!!**

భారత్-రష్యా సంబంధాలు పరస్పర విశ్వాసమే ఆధారంగాకాల పరీక్షకు నిలిచాయని ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ అన్నారు. భారత విదేశాంగ విధానంలో రష్యాది ప్రత్యేక స్థానమని ఆయన పేర్కొన్నారు. రెండు దేశాల సంబంధాలు గత 60 ఏళ్లుగా పరిణామం చెందుతూ వచ్చాయన్నారు. రెండు దేశాల అభిప్రాయాల్లో సారూప్యతలున్నాయని.. అంతర్జాతీయ అంశాలపై నిరంతరం చర్చలు జరుపుతున్నాయని మన్మోహన్ పేర్కొన్నారు.

## ఈ ఐదు అత్యంత కీలకం:

**సీమాంతర ఉగ్రవాదం...** భారత్, రష్యా రెండూ సీమాంతర ఉగ్రవాదం బాధిత దేశాలే. కాశ్మీర్, చెచెన్యాలే అందుకు ప్రబల నిదర్శనాలు. ఈ రెండు ప్రాంతాలు అంతర్జాతీయ ఉగ్రవాదం బారినపడ్డాయి.

**మధ్య ఆసియా, అఫ్గానిస్థాన్...** భారత్, రష్యాలకు ప్రధాన ఉమ్మడి శత్రువు.. ఉగ్రవాదం. ఈ ఉగ్రవాదానికి కేంద్రం... మధ్య ఆసియా, అఫ్గానిస్థాన్. ఉగ్రవాదం, అతివాదం మధ్యఆసియా భద్రతకు ప్రధాన సవాళ్లుగా మారాయి. మరోవైపు ప్రాంతీయ సమస్యల పట్ల రెండు దేశాల దృక్పథం కూడా ఒకే విధంగా ఉంది.

**రక్షణ సహకారం...** భారత్ తన మిలిటరీ హార్డ్‌వేర్, టెక్నాలజీ అవసరాల కోసం ప్రధానంగా రష్యాపైనే ఆధారపడుతోంది. ఆయుధాల అమ్మకం, తయారీ; కొత్త హార్డ్‌వేర్ కోసం ఉమ్మడి పరిశోధనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో.. రెండు దేశాల మధ్య రక్షణ సహకారం సరికొత్త దిశను సంతరించుకుంది.

**పరస్పర విశ్వాసం, అవగాహన...** భారత్-రష్యా సంబంధాలకు పరస్పర విశ్వాసం, అవగాహనలే ఆధారం. పూర్వ వైభోగాన్ని సంతరించుకుంటున్న రష్యా... బహుళ ధ్రువ ప్రపంచం దిశగా అంతర్జాతీయ సంబంధాల్లో సరికొత్త పాత్రను పోషించగలదని భారత్ విశ్వసిస్తోంది. అదేసమయంలో ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత దేశం... ప్రపంచంలో కీలక శక్తిగా మారుతుందని రష్యా భావిస్తోంది. ఆ దిశగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత ప్రయత్నాలకు రష్యా మద్దతు కూడా తెలిపింది.

**ఇంధన భద్రత...** భారత్-రష్యా సంబంధాల్లో ఇంధన భద్రత అత్యంత కీలకంగా మారింది. గ్యాస్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో.. ఆయిల్ ఎగుమతుల్లో రెండో స్థానంలో ఉన్న రష్యాతో సన్నిహిత సంబంధాలు భారత్ ప్రయోజనాలకు ఎంతో దోహదం చేస్తాయి. గ్యాస్ పరిశ్రమపై ప్రయివేట్ రంగం పట్టు తగ్గించేందుకు రష్యా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇది భారత కంపెనీల కు ప్రయోజనం చేకూరుస్తుంది.

**ద్వైపాక్షిక వాణిజ్యం...** భారత్-రష్యాల మధ్య వాణిజ్యం ఆశించిన స్థాయిలో లేదు. 2010 నాటికల్లా రెండు దేశాల మధ్య 10 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. సఖాలిన్-1, మొదటి దశలో భార త్ 2.5 మిలియన్ టన్నుల ముడి చమురును దిగుమతి చేసుకుంది. రెండు దేశాల మధ్య ఈ రంగంలో సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని భారత్‌కు చెందిన ఓఎన్‌జీసీ, రష్యాకు చెందిన దాని భాగస్వామ్య సంస్థ రోస్‌నెఫ్ట్ అంగీకరించాయి.

## నేపథ్యం:

మాజీ సోవియట్ యూనియన్‌తో భారత సంబంధాలు భౌగోళిక, వ్యూహాత్మక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాల ఆధారంగా కొనసాగాయి. ప్రచ్ఛన్నయుద్ధ సమయంలో ఆసియా ప్రాంతంలో భారత్, రష్యాకు కీలక మిత్ర దేశంగా పరిగణించడం జరిగేది. 1971లో సోవియట్ యూని యన్, భారత్‌ల మధ్య శాంతి, సహకార, స్నేహ ఒప్పందం జరిగింది. 1993లో రష్యా అధ్యక్షుడు బోరిస్ ఎల్సిన్ భారత పర్యటన సందర్భంగా ఈ ఒప్పందం స్థానంలో మరో ఒడంబడికపై రెండు దేశాలు సంతకాలు చేశాయి.

## 2000- పుతిన్ పర్యటన:

2000, అక్టోబర్3-6 తేదీల మధ్య రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించారు. పుతిన్‌తోపాటు 70 మంది సభ్యుల ఉన్నతస్థాయి బృందం కూడా భారత్‌కు వచ్చింది. వీరిలో రష్యా డిప్యూటీ ప్రధాన మంత్రి, విదేశాంగ మంత్రి, రక్షణ మంత్రి కూడా ఉండటం విశేషం. రెండు దేశాల మధ్య సంబంధాలకు ఈ పర్యటన మరింత ఊత మిచ్చింది. 2001, అక్టోబరు 3న పుతిన్, భారత ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పేయి వ్యూహాత్మక భాగస్వామ్య డిక్లరే షన్‌పై సంతకాలు చేశారు.

## డిక్లరేషన్‌లో కీలకాంశాలు:

- భారత్, రష్యాలు వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాల దిశగా అడుగులేయాలి.
- పరస్పర అవగాహన, దీర్ఘకాలిక విశ్వాసం, నమ్మకం ఆధారంగా బహుముఖ సంబంధాలు కొనసాగించాలి.
- రెండు దేశాల మధ్య సంబంధాలకు సార్వభౌమత్వం, సమన్యాయం, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం

చేసుకో కపోవడం,పరస్పర గౌరవం మూల సూత్రాలు కావాలి.

- రాజకీయ, వాణిజ్య, ఆర్థిక, రక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని వేగవంతం చేయాలి. భారత్, రష్యాల మధ్య సహకారం ఏ ఇతర దేశానికి వ్యతిరేకం కాదని రెండు దేశాలు తమ డిక్లరేషన్‌లో స్పష్టంచేశాయి.
- తమ వ్యూహాత్మక భాగస్వామ్యం ఎలాంటి సైనిక- రాజకీయ కూటమి ఏర్పాటుకు ఉద్దేశించింది కాదని కూడా పేర్కొన్నాయి.

## డిక్లరేషన్ ప్రాధాన్యం:

పుతిన్, వాజ్‌పేయి డిక్లరేషన్‌లో.. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సైన్స్ రంగాల్లో సహకారాన్ని నొక్కి చెప్పారు. దాంతోపాటే రక్షణ, భౌగోళిక వ్యూహాత్మక అంశాలను సైతం రెండు దేశాలు తమ అవగాహనలో భాగం చేశాయి. ఒకరకంగా ఇది భద్రత భాగస్వామ్యమని.. భద్రత విస్తృత అంశంగా మారనుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత్, రష్యాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం.. అంత ర్జాతీయ వ్యవస్థల ప్రజాస్వామ్యీకరణ ద్వారా ప్రపంచంలో బహుళ ధ్రువ వ్యవస్థ ఏర్పాటుకు సంకేతమని చెప్పొచ్చు. భారత్-రష్యాల వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం.. రెండు దేశాల మధ్య సంబంధాల్లో మైలు రాయి అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది భవిష్యత్‌లో ఇతర దేశాలకు ఆదర్శంగా కూడా నిలుస్తుందని వారు పేర్కొంటున్నారు. పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, మధ్య ఆసియా వంటి ప్రాంతాల్లో అతివాద ప్రేరిత ఉగ్రవాదం, మత్తుమందుల అక్రమ రవాణాను నిరోధించే దిశగా కూడా ఈ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం దోహదం చేస్తుందని భావిస్తున్నారు. ఉగ్రవాదం, వేర్పాటు వాదంపై ఉమ్మడి పోరాటానికి ఇరు దేశాలు కలిసి పనిచేయాలని నిర్ణయిం చడం... అంతర్జాతీయ ఉగ్రవాదంపై భారత పోరుకు దోహదపడుతుంది.

## భారత్-రష్యా రక్షణ సంబంధాలు:

- రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన సందర్భంగా నాలుగు కీలక రక్షణ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందాల్లో ప్రాధాన్యం సంతరించుకున్న సైనిక, సాంకేతిక సహకారం అంశాలు రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టపరుస్తాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.
- సైనిక-సాంకేతిక సహకారంపై ఇంటర్-మినిస్టీరియల్ కమిషన్ ఏర్పాటుకు 2000,అక్టోబరు 4న భారత్, రష్యా అంగీకరించాయి. రెండు దేశాల మధ్య అన్నిరకాల మిలిటరీ హార్డ్‌వేర్ బదిలీకి సంబంధించిన అన్ని అంశాలను ఈ కమిషన్ పర్యవేక్షిస్తుంది.
- సుఖోయ్-30ఎంకేఐ ఫైటర్ జెట్‌ల ఉత్పత్తికి సంబంధించి 2000, డిసెంబర్ 28న భారీ రక్షణ ఒప్పందం జరిగింది. తద్వారా వచ్చే 17 ఏళ్లలో 140 ఎస్‌యూ-30 ఎంకేఐ లాంగ్‌రేంజ్ జెట్‌ల ఉత్పత్తికి మార్గం సుగమం అయింది. ఈ ఒప్పందం విలువ 3 బిలియన్ల డాలర్లు. ఎస్‌యూ-30ఎంకేఐ టెక్నాలజీ

బదిలీ రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాల పటిష్టతకు నిదర్శనమని రక్షణ రంగ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. **టీ-90 ట్యాంక్ డీల్...** 310 టీ-90 ట్యాంకుల కొనుగోలు కోసం 2001, ఫిబ్రవరి 15న భారత్- రష్యాల మధ్య ఒప్పందం జరిగింది. పలు కీలక ఆయుధాలతో పాటు టీ-90 ట్యాంకుల తయారీకి ఈ ఒడంబడి ద్వారా అనుమతి లభిస్తుంది. భవిష్యత్ యుద్ధాలను కాశ్మీర్‌లోని పర్వత ప్రాంతంలో కాకుండా.. ఎడారి ప్రాంతంలో జరిగేలా చూడాలనే భారత సూత్రప్రాయ నిర్ణయానికి అనుగుణంగా 650 మిలియన్ డాలర్ల ఒప్పందం కూడా జరిగింది.

## వార్షిక సదస్సుకు మెద్వెదేవ్:

భారత్, రష్యాల మధ్య వార్షిక సదస్సులు 2000లో ప్రారం భమయ్యాయి. ఈ వార్షిక సదస్సులకు హాజరయ్యేందుకు రష్యా అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్ డిసెంబర్ 5-7, 2008 మధ్య భారత్‌లో పర్యటించారు. ఆ సందర్భంగా రెండు దేశాల మధ్య 10 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి.

- తమిళనాడులోని కుందన్‌కుళంలో అదనంగా మరో నాలుగు అణు రియాక్టర్ల నిర్మాణానికి వీలుగా భారత్- రష్యాల మధ్య ఒప్పందం జరిగింది. అక్కడ ఇప్పటికే 1000 మెగావాట్ల రెండు లైట్ వాటర్ రియాక్టర్ల ఏర్పాటుకు రష్యా సహకరిస్తోంది. రష్యన్ స్టేట్ కో ఆపరేషన్ డైరెక్టర్ జనరల్ రుస్తుం సెరిగిరి కిరియెంకో, భారత అటామిక్ ఎనర్జీ చీఫ్ అనిల్ కకోద్కర్ పౌర అణు సహకార ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇది రెండు దేశాల మధ్య పౌర అణు సహకారానికి దోహదం చేస్తుంది. భారత్‌కు 2000 టన్నుల యురేనియంను సరఫరా చేసేందుకు వీలుగా రెండు దేశాల మధ్య ఒప్పందానికి రంగం సిద్ధమవుతోంది. ఇది భారత అణు రియాక్టర్ల ప్రస్తుత సామర్థ్యం 40-60 శాతం నుంచి 90 శాతానికి పెంచనుంది.
- భారత వైమానిక దళం కోసం రష్యా నుంచి 80 ఎంఐ- 17వీ-5 హెలికాప్టర్ల కొనుగోలుకు సంబంధించి 1.2 బిలియన్ డాలర్ల ఒప్పందంపై భారత్ సంతకాలు చేసింది. అత్యంత ఆధునిక టెక్నాలజీ, సామర్థ్యం కలిగిన ఈ హెలికాప్టర్లు 18,000 అడుగుల ఎత్తున కూడా ల్యాండ్ కాగలవు. మానవ సహిత అంతరిక్ష వాహకాలు.. చంద్రయాన్ 2 వంటి భారత అంతరిక్ష కార్యక్రమాల విషయంలోనూ భారత్‌కు రష్యా సహకరిస్తోంది.
- మెద్వెదేవ్ భారత పర్యటన సందర్భంగా రెండు దేశాలు ఒక ఉమ్మడి ప్రకటనను విడుదల చేశాయి. ముంబయి పై ఉగ్రవాదల దాడి నేపథ్యంలో.. భారత్‌కు రష్యా తన పూర్తి సంఘీభావాన్ని తెలిపింది. ఉగ్రవాదానికి పాల్పడుతున్న, ఊతమిస్తున్న శక్తులను శిక్షించే విషయంలో ప్రపంచ దేశాలు భారత్‌కు అన్నివిధాల సహకరించాల ని రష్యా సూచించింది.

## ఆర్థిక సంబంధాలు:

భారత్, రష్యాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ఏటా 30శాతం మేర పెరుగుతోంది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి కల్లా 7బిలియన్ డాలర్లకు చేరుకోనుంది. రష్యా నుంచి భారత్‌లోకి మొత్తం ప్రత్యక్ష

పెట్టుబడులు(ఎఫ్‌డీఐ)ఆగస్టు, 2008 నాటికి 144 మిలియన్ డాలర్లు. బ్యాంకింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, టెలీకమ్యూనికేషన్స్, పవర్, ఫార్మాస్యూటి కల్ రంగాల్లో సహకారాన్ని విస్తరించే దిశగా, అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా కృషి చేయాలని తమ దేశాల వ్యాపార వర్గాలకు భారత్, రష్యా సూచించాయి.

## మెద్వెదేవ్ పర్యటన... ప్రాధాన్యం:

రష్యా అధ్యక్షుడు మెద్వెదేవ్ భారత్ పర్యటన రెండు దేశాల సంబంధాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపనుంది. ఎందు కంటే... మెద్వెదేవ్ పర్యటన సందర్భంగా పౌర అణు సహకార ఒప్పందం, రక్షణ ఒప్పందం, ఉగ్రవాదంపై ఉమ్మడి ప్రకటన వంటి కీలక నిర్ణయాలు జరిగాయి. రష్యాతో అణు సహకార ఒప్పందం రెండు దేశాల మధ్య సంబంధాల్లో మైలు రాయిగా మన్మోహన్ సింగ్ అభివర్ణించారు. ఇంధన, రక్షణ రంగాల్లో సహకారం... భారత్, రష్యాల మధ్య సంబంధాలకు మూల స్తంభాలని మెద్వెదేవ్ పేర్కొన్నారు!!